# జీవనరాగం

## –కె. తాయారమ్మ

వెన్నెల పుచ్చపువ్వులా కాస్తోంది. నింగిలోని చందమామని చూసి ఎగిసి ఎగిసి పడుతోంది సముద్రం. ''చంద్రుడికీ సముద్రానికీ ఏమిటో ఈ అవినాభావ సంబంధం?''

సముద్రపు నీటి మీద నుంచి వచ్చిన చల్లనిగాలి హాయిగా ఆహ్లాదంగా చక్కిలిగింతలు పెడుతోంది.

రాత్రి పదిగంటల సమయం.

సాగర్ సముద్రం ఒడ్డున కూచున్నాడు. అతని మనోసాగరంలో ఎన్నో అలలు చెలరేగుతున్నాయి.

ఎదురుగా కనిపిస్తున్న సముద్రాన్ని, ఒడ్డుకి చేరాలని విఫల ప్రయత్నం చేసి అపజయాన్ని పొందుతున్న కెరటాల్ని చూస్తున్నాడు. ఈ సముద్ర కెరటాలకి ఎందుకింత ఆశ? అన్నిటినీ తనలో ఇముడ్చుకోగల సముద్రం మరి దేనికోసం అర్రులు చాస్తోంది?

వెన్నెలవానలో తడిసిన సముద్రపు ఇసుకరేణువులు తళుకు లీనుతున్నాయి. నీలిరంగు సముద్రం వెన్నెల వెల్లువతో కలిసి వింత సోయగాన్ని సంతరించుకుంటున్నది.

సాగర్‌లో ఆలోచనలు సముద్ర కెరటాలకంటే అధికంగా సాగిపోతున్నాయి. సముద్రం ఎప్పుడూ ఉత్సాహంగా ఉరకలు వేస్తూ వుంటుంది. కానీ..కానీ..తన మనోసంద్రంలో మాత్రం అంతులేని అలజడులు చెలరేగుతుంటాయి.

సముద్రం ఎప్పుడూ ఉత్సాహంగానే వుంటుందా? కాదు. తన అంచనా తప్పు! వెన్నెల కురిసినప్పుడే సముద్రం ఉప్పొంగిపోతుంది!

తను ఎన్నో వెన్నెలరాత్రులు, చీకటి రాత్రులు కూడా ఈ సముద్రం ఒడ్డునే గడిపాడు. గడుపుతున్నాడు. చీకటిలో వెలుగులో సముద్ర సౌందర్యాన్ని ఆస్వాదిస్తూనే వున్నాడు.

దూరంగా ఒకటి రెండు పడవలు సాగిపోతున్నాయి సముద్రంలో. జాలరులా? లేక ఎవ్వరైనా వెన్నెల విహారానికి వెళ్లేరా? ఎందుకో అతని మనస్సు కలుక్కుమంది. వెచ్చని నీటి బిందువులు అతని చెక్కిళ్ల మీదుగా జారాయి.

''ఛీ మగవాడి కళ్లల్లో నీళ్లా?''

ఎన్నిసార్లు తను..తరంగరంజితమైన ఆ సముద్రం మీద విజయ విహారం చెయ్యలేదు?

ఎవరితో?

'మనస్సు భరించ లేని ప్రశ్న!' సముద్రపు ఘోషలతో పోటీ పడుతున్నాయి అతని అంతరంగపు ఘోషలు.

అంతవరకూ అతని చేతిలో వున్న కలం కాగితాలు కొన్ని అక్షరాల్ని కూడా రూపుదిద్దుకోలేకపోయాయి. అలజడుల సంద్రంలో పడి కొట్టుకుపోతున్నాయి అతని భావాలన్నీ. ఇదే మరొకప్పుడయితే ఎన్నో సుందర రచనా శిల్పాలను చిత్రించి వుండేవాడు. మరెన్నో భావ చిత్రాలకు రూపుదిద్దేవాడు. కానీ...'ఇప్పుడు?' మనోసంద్రంలో అంతులేని మథనం. నీలికెరటాలలాంటి ఆలోచనలు!

కళ్లజోడు తీసి తుడిచి మళ్లీ పెట్టుకున్నాడు సాగర్. అతను రచయిత. ఊహ అతని ఊపిరి. భావన అతని అంతరంగం. ఈరోజు సర్వం కోల్పోయిన వాడిలా నిశ్శబ్దంగా వుండిపోతున్నాడు.

తనకీ సముద్రానికీ ఏమిటీ అవినాభావ సంబంధం? ''సముద్రం ఎప్పుడైనా నిశ్శబ్దాన్ని సంతరించుకుంటుందా?''

సన్నని నవ్వు వెలిగింది సాగర్ పెదవుల మీద. తన భావనా సంద్రంలో ఎన్నో కథలు, కవితలు, నవలలు కొట్టుకుపోయాయి. అవి ఒక్కటీ గుర్తుకు రావడం లేదు. మళ్లీ కొత్త అలలు లేస్తున్నాయి. కాని అవి ముందే చెల్లాచెదరై పోతున్నాయి సముద్రతరంగాల్లా.

''నువ్వు రచయితవి. ఊహల సంద్రాలను సృజిస్తావ్! అదృష్టవంతుడివి!'' అంటాడు మిత్రుడు ఆనంద్. తనకు నవ్వు వస్తూ వుంటుంది. తను ఊహాజీవి మాత్రమేనా? వాస్తవం తనకి చేరువకాదా? ఊహ ఊపిరి పోసుకుంటే వాస్తవం వెక్కిరించింది.

ఒక్కసారి సముద్రంలోకి చూశాడు. ఎందుకో సముద్రాన్ని చూస్తే జాలి అనిపించింది సాగర్‌కి. సముద్రానికి రత్నాకరం అని పేరు. కాని..కాని..తనకి ఏం మిగుల్చుకుంది? ఉప్పునీళ్లు మాత్రమే! ఎదుటివారికి దప్పిక తీర్చడానికి తన నీళ్లు ఏమాత్రం పనికిరావు! అని వాపోతున్నట్టనిపిస్తుంది.

'ఏమిటీ వైపరీత్యం?'

'తను మాత్రం ఏం సుఖ పడుతున్నాడు?' లక్షలకి వారసుడు. తల్లిదండ్రులకి ఒక్కగానొక్క కొడుకు. తను కోరుకున్నది తాను పొందగలిగేడా?

రత్నాకరం కదా సముద్రం. మరి ఎందుకు ఘోషపెడుతుంది? అనుకునే వాడు ఇదివరలో కాని..తనో?

సముద్రపు ఘోషలతో సాగర్‌లోని ఆలోచనలు కూడా పోటీపడుతున్నాయి.

ఆలోచిస్తూ చేతులు వెనక్కి వాల్చి నింగినీ, సముద్రాన్నీ మార్చి మార్చి చూస్తున్నాడు సాగర్.

దూరం నించి కదలివస్తున్నది ఓ మానవాకారం. ఒక్క ఉదుటున లేచి కూచున్నాడు సాగర్. ఆ ఆకారం నీటి దగ్గరగా వస్తున్నది.

శ్వేత వస్త్రధారిణి అయిన ఆమె ఎవరో? ఈ రాత్రి వేళ ఇక్కడికి రావలసిన అగత్యం ఆమెకి ఏం వచ్చిందో?

సముద్రం నురుగులతో పోటీపడుతున్న తెల్లని వస్త్రాలంటే తనకెంతో ఇష్టం!

ఆరోజు ఇదే వెన్నెలలో..సముద్రం నురుగులాంటి వెంకటగిరి జరీ చీరలో..నల్లని బారెడు జడతో...ఎవరామె?

''అభిసారికా?''మనోసముద్రం జ్ఞాపకాల లోతుల్ని తవ్వుతూ వుంటే..ఆ..ఆ..కారం ఒక్కసారి నీళ్లలో దూకడం...వెంటనే సాగర్ లేచి వెళ్లి నీళ్లలోకి గెంతి పట్టుకోవడం ఒకేసారి జరిగాయి.

''ఎవరు మీరు? ఎందుకీ సాహసం చేసేరు?''

అంటూ ఆమెను పట్టుకుని బైటికొచ్చిన సాగర్, ఒక్కసారి ఆమె ముఖంలోకి చూసి, ఆశ్చర్య సంద్రంలో


తేలిపోతూ ``తరంగిణీ నువ్వా?'' అన్నాడు.

తనని రక్షించినది సాగర్ అని తెలిసిన తరంగిణి,

``సాగర్ నన్నాపకు! నాలాంటి దురదృష్టవంతు రాలు జీవించ కూడదు!''

``ప్రాణం తీసుకునే అధికారం నీకెవరిచ్చారు? ముందు చెప్పు నన్నెందుకు దూరం చేశావు? ఈమూడే ళ్ళుగా నీకోసం పిచ్చివా ణ్ణయి ఎంత కుమిలిపోతు న్నానో నీకేం తెలుసు? సముద్ర మథనంలాంటి సమస్యలతో నా అంత రంగం ఎంత బాధపడు తోందో గ్రహించావా?

``చెప్పుతరంగిణీ చెప్పు! నీతో జీవితం పంచు కోవాలనీ నీ పాట వింటూ హాయిగా జీవితం గడపా లనీ, నదీ సముద్రం కలిసి పోయినట్లు మన జీవితాలు కలిసి పోవాలనీ ఆశించిన నాకు ఎందుకీ ఒంతరిత నాన్ని మిగిల్చావు? చెప్పు తరంగిణీ చెప్పు'' సము ద్రపు గాలితో కలిసి సాగర్ ప్రశ్నలు కూడా తరంగిణిని ఊపివేశాయి.



``జరగకూడనిదే జరిగింది సాగర్! కట్నాల రక్కసి కోరలలో చిక్కుకున్న మా నాన్న మీ అంతస్థుకి ఎదగలేక నాకో సంబంధం చూశాడు. రాజేంద్ర ప్రసాద్‌గారు బాగా డబ్బున్న మనిషి. ఆయనది మూడవ పెళ్ళి! వయస్సు అర్వై దగ్గరుంటుంది. సముద్రం అంత కొంప. ఆరుగురు పిల్లలు.''

``అయితే ఆయన్ని నువ్వు?'' అర్థోక్తిలోనే ఆగిపో యాడు సాగర్.

``అవును సాగర్!... అయిదుగురు పిల్లలతో సంసార సాగరాన్ని ఈదుతున్న సామాన్యమైన బడిపంతులు మానాన్న! సముద్రంలో కురిసిన మంచు బిందువుల లాంటివి మాకన్నె బ్రతుకులు. కట్నాలనే సుడి గుండా లలో చిక్కుకుపోయి తేలలేక, మునగలేక జీవితాలనే బలి చేసుకునే దౌర్భాగ్యపు బ్రతుకులు మావి.

రాజేంద్రప్రసాద్‌గారు వచ్చి అడగగానే, నాన్న నావైపు జాలిగా చూశారు! నేను ఒప్పుకున్నాను కా...ని'' ఏదో అనాలని ఆగిపోయింది తరంగిణి.

``చెప్పు తరంగిణీ!''

``నాన్న సముద్ర గంభీరులు. నా పెళ్ళితోనయినా మా ఇంటి సమస్యలు చక్కబడుతాయనుకున్నాను! కా...ని..పెళ్ళి నాటికే హృద్రో గంతో వున్న రాజేంద్రప్రసాద్ గారు అందర్నీ దుఃఖ సాగరంలో ముంచి మర ణించారు.

అప్పటికి నేను అడుగుపెట్టి నెలరోజులే అయింది. సముద్రపు లోతుల్ని చూడడం ఎంత కష్టమో ఆ ఇంటి సంగతి తెలుసుకోవడం కూడా అంత కష్టమే.

సాగర్ కన్నులలో నీటి తడి మెరిసింది. ``తరం గిణీ..నువ్వు ఇప్పుడు ఎక్కడ వుంటున్నావు? మాష్టారెలా వున్నారు?''

``నాన్న పోయారు! తమ్ముళ్ళనీ, చెల్లెళ్లనీ చూసు కుంటూ, ఇక్కడికి దగ్గరలో వున్న పల్లెలో, మా తాతగారి ఇంట్లో వుంటున్నాము.''

``మరి రాజేంద్రప్రసాద్‌గారి ఆస్తి?''

``సముద్రం అంత ఆస్తి వుంది రాజేంద్రప్రసాద్‌గా రికి. కాని ఆయనపోగానే, నాకంటే పెద్ద అయిన ఆయన పిల్లలు నన్ను అక్కడ వుండనివ్వలేదు! ఇక కోర్టుకి ఎక్కాలనుకోలేదు.''

``మరి..ను..వ్వు..ఇవాళ..ఇలా..సము ద్రంలో..దూకడంలో ఆంతర్యం?''

చిన్నగా నవ్వింది తరంగిణి.

``కథ పాతదే సాగర్! నా చెల్లెలు ఎవర్నో ప్రేమిం చింది. వాళ్ల నాన్న యాభైవేలు కట్నం తెమ్మన్నాడు. అది పిచ్చిదయ్యింది. ఇవన్నీ చూస్తూ రోజురోజుకీ కుమి లిపోయే కంటే ఒక్కసారి చావడం నయం! అందుకే దూకాను. ఆడ పిల్లల జీవితానికి వరకట్నం ఒక శాపం ఈ కట్నం అనే సముద్రంలోంచి ఎప్పుడు బయటపడ తారో కన్నె పిల్లలు?'' తరంగిణి చెక్కిళ్ల మీద నించి నీరు జాలువారి పెదవుల్ని తడిపాయి సముద్రపు నీళ్లలా ఉప్పగా.

సముద్రపు నీళ్లలో తడిసి ముద్దయి ఒంటికి అంటు కుపోయిన బట్టలలో వున్న తరంగిణి అజంతా శిల్పంలా వుంది.

అసలు తరంగిణితో తనకెలాంటి పరిచయం? మనస్సు సముద్రంలాంటి గతాన్ని తవ్వుతోంది.

మూడేళ్ళక్రితం...

సముద్రపు ఒడ్డున కూచున్నాడు సాగర్. అతని చేతిలో కలం కాగితాలు వున్నాయి. సంధ్యా సముద్రంలో చక్కదనం చూసుకుంటున్న వేళ. చక్కని కవితా వెల్లు వలా ప్రవహించి అతని కలం నుంచి టైమంతయ్యిందో తెలియడం లేదు!

గగన వీధిలో జాబిల్లి విజయవిహారం చేస్తూ వుంటే, సముద్రం హొయలు ఒలకపోస్తోంది! వెన్నెల వానలో

ఇసుక తిన్నెలు తానాలు చేస్తున్నాయి.

తను నిర్మించిన మనోజ్ఞ కవిత శిల్పాన్ని చూసుకుంటున్నాడు సాగర్.

''ఓహో..మీరు కవికుమారులా? ఎంత సేపైందో...చూస్తున్నాను ఊహా సంద్రాలలో తేలిపోతున్నారు తప్పించి ఇటు చూడడం లేదు'' వెన్నెలకురిసిన నవ్వు!

''ఎవరు?'' అంటూ తలఎత్తిన సాగర్ తనని తాను మరచిపోయాడు క్షణకాలం. సముద్రపు నురుగులాంటి తెల్లని వెంకటగిరి జరీచీర, నల్లని పొడవాటి జడ, మెడలో సముద్రపు నీటి బిందువులలాటి నీలిరంగు క్రిస్టల్స్ దండ..ఎవరీ మనోజ్ఞ శిల్పసుందరి? అభిసారికా? మాధవుణ్ణి వెతుక్కుంటూ వచ్చిన రాధికా?

''మీరెవరో తెలుసుకోవచ్చా?''

''తరంగిణి!'' సముద్రపు గలగలలు వినిపించాయామె నవ్వులో.

''అంటే..? రేడియోలో పాటలు పాడుతారు. మీరేనా?

''అవును!ఏదీ ఆ కవిత ? ఇలాతెండి!''

''అద్భుతం!నేను దీనికి ట్యూన్ కడతాను! మరి వస్తాను!''

వెన్నెలలో కలిసిపోయింది ఆమె జ్యోత్స్నాభిసారికలా.

'తరంగిణి!' ఎంత మధురంగా వుంది ఆ పేరు! క్షణకాలం ఆమె వెళ్లిన వైపే చూస్తూ వుండిపోయి, తరువాత ఇంటికి బయలుదేరాడు సాగర్.

ఇంట్లోకి అడుగుపెడుతుండగానే వినిపించింది సముద్ర గర్జనలాంటి తండ్రి పిలుపు.

''ఏమోయ్, ఇంత సేపు ఎక్కడికి వెళ్ళావ్? ఆ సముద్రం ఒడ్డున కూచుని కవిత్వాలు రాయకపోతే చక్కగా బిజినెస్ చూసుకోరాదూ? లక్షలు ఆర్జించరాదూ? ఈ కవిత్వాలు దేనికి పనికి వస్తాయి? పైగా ఆడపిల్లల తల్లిదండ్రులు మన ఇంటిచుట్టూ తిరుగుతున్నారు లక్షలు కట్నం ఇస్తామంటూ''

సముద్రపు హోరులాంటి తండ్రి వాగ్ధాటికి క్షణకాలం నిరుత్తరుడై ఆ వెనువెంటనే సర్దుకుని ''నాన్నగారూ నేను అప్పుడే పెళ్లి చేసుకోను. సంసార సాగరంలోపడి నా స్వేచ్ఛని పాడుచేసుకోలేను!'' అంటూ గబగబా మేడ మెట్లెక్కి తన గదికి చేరుకున్నాడు సాగర్.

తరంగిణిని గుర్చిన ఆలోచనలు అతన్ని సముద్రపు అలల్లా వెంటాడుతున్నాయి.

వారం రోజులు దొర్లాయి.

ఆ రోజు ఆదివారం.

సాగర్ నిద్ర లేచేసరికి ఏడున్నర అయ్యింది. బెడ్ పక్కనే వున్న రేడియో ఆన్ చేశాడు. చక్కని లలిత సంగీతం వినవస్తోంది రేడియోలోంచి. మధుర మంజులంగా వుందా కంఠం. సముద్రపు నీటి మీద నించి వచ్చిన పిల్ల తెమ్మెరలా వుంది ఆ గానం. తరువాత మరో జానపద గేయం మొదలయ్యింది. ''నింగిలోని సెందురుడు, నిక్కి నిక్కి సూత్తుంటే, నేల మీది సంద్రమ్ము, ఎగిసి ఎగిసి పడుతుంటే, బతుకంత యెన్నెలేను వేలమ్మీ!'' పాట వింటూనే ఒక్క ఉదుటున మంచం మీంచి లేచి కూచున్నాడు సాగర్. అతని హృదయం సముద్రంలా ఉప్పొంగిపోయింది.

''పాడిన వారు కుమారి తరంగిణి. రచన సాగర్!'' ఎనౌన్సర్ గొంతు వినిపించింది.

ఆ సాయంత్రం సముద్రం వైపు వెళ్లాడు.

''పాట ఎలా వుంది?'' తరంగిణి వచ్చి ఎదురుగా నిలుచుంది.

''బాగా పాడారు!''

''కాదు! బాగా రాశారు!''

ఇద్దరూ నవ్వేరు ఒకేసారి.

ఇలా పరిచయమైన తరంగిణీ సాగర్‌ల స్నేహం దినదినాభివృద్ధి చెంది, అది ప్రేమగా మారి, సముద్రమంత పెరిగింది.

కాని...కాని...ధనికులకి పేదలకీ మధ్య వున్న సముద్రం అంత అంతరం వాళ్ల ప్రేమకి ఆనకట్ట వేసింది.

పెళ్లికొడుకు తండ్రి నాగభూషణరావు పెళ్లి కూతురు తండ్రి అయిన పరంధామయ్య ఇంటికెళ్లి నానా మాటలూ అన్నాడు. సముద్రం అంత ఆస్తి తమకి వుందన్నాడు. సముద్రపు ఒడ్డున వున్న ఇసుక రేణువు పాటి చెయ్యవు మీ బ్రతుకులు అన్నాడు. మా అబ్బాయి జోలికి వస్తే మీ కుటుంబాన్ని సముద్రంలో ముంచేస్తానన్నాడు.

పర్యవసానం రాజేంద్రప్రసాద్‌గారితో తరంగిణి పెళ్లి.

దుఃఖ సముద్రంలో మునిగిపోయిన తండ్రిని చూసి, ఈ పెళ్లికి ఒప్పుకుంది. ''సాగర్ మీరంటే నాకిష్టం లేదు!'' అనే రెండు మాటలు రాసి పడేసింది.

తరంగిణి కోసం సాగర్ పిచ్చివాడే అయ్యేడు. లక్షల ఆస్తితో వచ్చే సంబంధాలన్నీ సముద్రపు నీటిలా దూరంగా నెట్టి వేస్తున్నాడు. ''తరంగిణీ!'' ఒక్కసారిగా గతంలోంచి వర్తమానం లోకి వచ్చి పిచ్చికేక పెట్టాడు.

తరంగిణి లేచి నిలుచుంది. ''తరంగిణీ మళ్లీ ఎక్కడికి వెళ్తున్నావు?, నన్ను వదిలి వెళ్లకు! ఈ లక్షల ఆస్తి, ఈ కట్నాలు నాకు వద్దు! నన్ను నీతో రానీ, నదీ సముద్రంలా కలిసిపోదాం.''

''ఆగు సాగర్! నేను వివాహితను! రాజేంద్ర గారి భార్యని పాలసముద్రం లాంటి నీ జీవితాన్ని కలుషితం చెయ్యలేను! నన్ను ఇలా ఒంటరిగానే మిగిలిపోనీ! సముద్రపు ఇసుకలో కప్పబడిపోయిన చిల్లిగవ్వలాంటిది నా జీవితం! వెళ్ళు సాగర్ వెళ్లు!''

''నేను వెళ్లను! నిర్బంధ వైధవ్యాన్ని అనుభవిస్తున్న నిన్ను ఒంటరిగా మిగిలిపోనివ్వను. సముద్ర తరంగాల లాంటి కట్నాల అలజడిలో కొట్టుకుపోయి నీలాంటి ఆడ పిల్లల జీవితాలు బలికాకూడదు! కట్నం లేకుండానే నీ చెల్లెలి పెళ్లి చేద్దాం! ధనమదంతో మిడిసిపడే ఈ పెద్దవాళ్ళ ఆటకట్టిద్దాం! ఏదీ చెయ్యి'' తరంగిణి చెయ్యి అందుకున్నాడు సాగర్.

వెన్నెల వానలో తడుస్తూ, సముద్రపు సోయగాల్ని తిలకిస్తూ నడుస్తున్నారు వాళ్లిద్దరూ.

''తరంగిణీ ఏదీ పాడు!''

''మీరు కవిత చెప్పండి! నేను పాడతాను!''

''జాబిల్లి నవ్వింది మన జంట చూసి! సంద్రమ్ము వెలబోయే మన బాట చూసి!'' సాగర్ కవితకి తన గానాన్ని జోడించింది తరంగిణి.

చందమామ సాగిపోతూనే వున్నాడు. వెన్నెల కురుస్తూనే వుంది. సముద్రం పొంగుతూనే వుంది.

వెన్నెల జుర్రుకుంటూ, సముద్రపుగాలుల్ని ఆస్వాదిస్తూ, సాగిపోతోంది ఆ జంట.

అలా ఎక్కడికో!

ప్రగతి పథకానికా?

బ్రతుకు బాటలో జీవనరాగాన్ని ఆలపిస్తూ సాగిపోతున్న ఆ జంటని చూస్తూ ఉత్సాహభరితంగా నవ్వింది సముద్రం.

★



## రవళించేనా?

ఎంతో హడావిడిగా మొదలైన రవళి సినీ కెరీర్ అంతే త్వరగా చల్లబడిపోవడం ఆశ్చర్యంగానే అనిపిస్తుంది. 'శుభాకాంక్షలు' లాంటి హిట్ చిత్రంలో నటించినా కూడా రవళికి అంతగా అవకాశాలు రాలేదు. లావుగా తయారు కావడం ఓ కారణంగా ప్రచారంలోకి వచ్చినా 'నేనేం పెద్ద లావుగా లేను, స్లిమ్‌గానే వున్నాను, అయినా ముందుగా అంగీకరించిన కొన్ని తమిళ చిత్రాలలో నటించడం వల్ల కూడా తెలుగులో కొన్ని చాన్స్‌లు మిస్సయ్యానని ఆమధ్య అంది రవళి. ఏది ఏమైనా రవళి ఆశలన్నీ ఇప్పుడు నవీన్ హీరోగా నటిస్తున్న 'పెళ్లాడి చూపిస్తా'పైనే వున్నాయని చెప్పాలి. మరి ఆశ నెరవేరేనా అని!

-జె.ఎం.